సమయపాలన పాటించాలి

బోథ్, అక్టోబర్ 17 : చౌక ధరల దుకాణాల డీలర్లు సమయపాలన పాటించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వాజీద్ అలీ సూచించారు. గురువారం సొనాల అంగన్‌వాడీ కేంద్రం-3, 18 నంబర్ చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం డీఎస్‌వో మాట్లాడుతూ అందుబాటులో ఉండి కార్డు దారులకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలన్నారు. డీఎస్‌వో వెంట డీటీ ఎన్ ఫోర్స్‌మెంట్ త్రయంబక్ ఉన్నారు.

బాధితుడికి పరామర్శ

నేరడిగొండ, అక్టోబర్ 17 : కొర్టికల్ గ్రామానికి చెందిన మేర్‌సింగ్ ఇటీవల గాయపడ్డాడు. బాధితుడిని గురువారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, బీఆర్ఎస్ నాయకుడు ప్రతాప్‌సింగ్ పరామర్శించారు. వారి వెంట గ్రామ పెద్దలు కిషన్, గులాబ్‌సింగ్, గోవింద్, చందర్‌సింగ్, రఘునాథ్ ఉన్నారు.

మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

బోథ్, అక్టోబర్ 17 : ధన్నూర్(బీ) వంతెన నిర్మాణానికి రూ.3 కోట్ల 30 లక్షలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మంజూరు చేశారు. గురువారం గ్రామస్తులు మంత్రి సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వీడీసీ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత గల పనులు ప్రణాళికలో చేర్చాలి

లక్ష్మణచాంద, అక్టోబర్ 17 : గ్రామానికి ఉపయోగపడే పనులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకుని ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంపీడీవో రాధిక అన్నారు. గురువారం బాబాపూర్ గ్రామంలో ఉపాధి హామీ గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

19న జిల్లా స్థాయి కళా ఉత్సవ్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 17: నిర్మల్‌లోని జేవీఎన్ఆర్ పాఠశాలలో ఈ నెల 19వ తేదీన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. మొత్తం ఆరు అంశాల్లో పోటీలు ఉంటాయని ఇందులో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన తొమ్మిది నుంచి 12 తరగతి వరకు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఆ తర్వాత జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.

టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన పోస్టర్ ఆవిష్కరణ

ఎదులాపురం, అక్టోబర్ 17 : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ పిలుపునిచ్చారు. గురువారం ఆదిలాబాద్‌లోని పిట్టలవాడలో టీయూసీఐ లో ఐఎఫ్‌టీయూ విలీన సభకు ముద్రించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉమ్రే సచిన్, జగన్ సింగ్ మాట్లాడుతూ ఈ విలీన సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు మనోజ్, నితిన్, రాజు, బుజ్జిరామ్, జగన్, రవి, విశాల్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

డీఎస్పీ జీవన్ రెడ్డికి సన్మానం

ఎదులాపురం, అక్టోబర్ 17 : ఆదిలాబాద్ డివిజన్‌లో శాంతి భద్రత విషయంలో రాజీ పడకుండా తన సర్వీస్ మొత్తంలో చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం అతి ఉత్కృష్ట సేవా పథకాన్ని ప్రదానం చేయడం అభినందనీయమని అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్ డీఎస్పీ కార్యాలయంలో సమితి ఆధ్వర్యంలో డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి నాయకులు తుల్జాపూర్ శోభాతాయి, నిమ్మల ప్రశాంత్, సూర్య వరప్రసాద్, సందీప్ దాండియా, ఊశన్న, నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భైంసాటౌన్,అక్టోంబర్ 17 : వాలేగాం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రమణా రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

కుంటాల, అక్టోబర్ 17 : ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని నాలుగో రోజు నిరసన కార్యక్రమాల్లో భాగంగా వాసవి డిగ్రీ కళాశాల యాజమాన్య సభ్యులు, అధ్యాపకులు గురువారం కల్లూరులో నల్ల బ్యాడ్జీలతో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కరస్పాండెంట్ జానకిరాం, అధ్యాపకులు గాజుల రంజిత్, సాయన్న, సాదక్ పాల్గొన్నారు.

ఎదులాపురం: కుమ్రం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



బోథ్ : నివాళులర్పిస్తున్న నాయకులు

గుడిహత్నూర్: నివాళులర్పిస్తున్న ఆదివాసులు

ఇచ్చోడలో..

పోరాట యోధుడికి ఘన నివాళులు

ఉట్నూర్‌రూరల్: పూజలు చేస్తున్న భానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

నార్నూర్: కుమ్రం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం/బోథ్/ఇచ్చోడ/గుడిహత్నూర్/నేరడిగొండ/తలమడుగు/ తాంసి/ఉట్నూర్/ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి/నార్నూర్/నిర్మల్ అర్బన్/దిలావర్‌పూర్/ముథోల్/దస్తురాబాద్, అక్టోబర్ 17: స్వయం పాలన, ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన మన్యం వీరుడు కుమ్రం భీం వర్ధంతిని గురువారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యాప్తంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జల్, జంగల్, జమీన్ కోసం ఆనాడు కుమ్రం భీం 12 గ్రామాలను ఏకం చేసి గిరిజనుల హక్కుల సాధనం కోసం పోరాటం చేశారని కొనియాడారు.



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న ఆదివాసీ గిరిజనులు

ఉట్నూర్: నినాదాలు చేస్తున్న నాయకులు

దిలావర్‌పూర్: న్యాలోలంలో నినాదాలు చేస్తున్న నాయకులు

బోథ్: సొనాలలో నివాళులర్పిస్తున్న ఆదివాసులు

తలమడుగు: నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

ఎదులాపురం: నివాళులర్పిస్తున్న సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు

రేషన్ బియ్యం అందక గిరిజనుల అవస్థలు

రేషన్ షాపు వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

పెంబి, అక్టోబర్ 17 : పెంబి మండలం శేట్‌పల్లి రేషన్ షాపులో రెండు నెలల నుంచి 50 శాతం మందికి బియ్యం అందకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని నెలల క్రితం రేషన్ డీలర్ మల్లేశ్ ఇక్కడ బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని ప్రజలు అందోళన చేపట్టారు. అతడిని సస్పెండ్ చేసి జూన్ నుంచి వస్పల్లి రేషన్ డీలర్‌కు ఇన్‌చార్జి ఇచ్చారు. 27 క్వింటాళ్ల బియ్యం లోటు ఉండడంతో సెప్టెంబర్‌లో 50 శాతం మందికి రేషన్ బియ్యం పంపిణీ చేయలేదు. ఈ షాపులో 355 మంది లబ్ధిదారులు ఉండగా అక్టోబర్ నెలలో రేషన్ షాపుకు 75 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉంది. కానీ 38 క్వింటాళ్లు బియ్యం మాత్రమే వచ్చాయి. దీంతో 50 శాతం మంది లబ్ధిదారులకు రెండు నెలలుగా రేషన్ బియ్యం అందడం లేదు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి స్పందన లేదని ప్రజలు వాపోతున్నారు. గిరిజన ప్రాంతం కావడంతోనే అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రేషన్ బియ్యం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముథోల్ అభివృద్ధికి పెద్దపీట

ముథోల్, అక్టోబర్ 17 : ముథోల్ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ సంబంధించి 100 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ జడ్పీటీసీలు లక్ష్మీ నర్సాగౌడ్, సాంబ్లీ రమేశ్, నాయకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తానూర్, అక్టోబర్ 17 : మండల కేంద్రంలోని రైతు వేదికలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మండలంలోని పలు గ్రామాల చెందిన 149 మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లింగమూర్తి, మండలాభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్, బీజేపీ మండల అధ్యక్షుడు చిన్న రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభం

ముథోల్, అక్టోబర్ 17: ముథోల్‌లోని జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు తాటి వార్ రమేశ్, జీవన్, సుదర్శన్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు చెల్లించాలి

నార్నూర్, అక్టోబర్ 17 : అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి సీడీపీవో శారదకు వినతిపత్రం గురువారం అందజేశారు. కార్యక్రమంలో పంచశీల, పంచపూల, లక్ష్మి, జంగు, మల్లు, అంజుత, వనజా, లత పాల్గొన్నారు.

సాజిమాక తనిఖీ బృందాలకు సహకరించాలి

నార్నూర్, అక్టోబర్ 17 : ఉపాధి హామీ ప్రజావేదిక సామాజిక తనిఖీ బృందం సభ్యులకు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. గాదిగూడలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, తనిఖీ బృందం సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈజీఎస్ ఏఈవో పవార్ నితిన్‌కుమార్, ఎస్ఆర్పీ తిరుపతి పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

బాసర, అక్టోబరు 17 : బాసర రైల్వే స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై గురువారం గుర్తు తెలియని వృద్ధ మహిళ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సుమారు 70 ఏళ్ల వయస్సు ఉంటుందని, యాచకురాలిగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆచూకి తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

భైంసాటౌన్, అక్టోబర్17 : పెండ్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డ గంగయ్య(40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గంగయ్య ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరుగుతూ రోజు మద్యం తాగుతు భార్యతో గొడవ పడేవాడు. ఎప్పటిలాగే బుధవారం గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో తండ్రి భూమయ్య గ్రామంలోని తన పశువుల కొట్టానికి వెళ్లి చూడగా మద్యం మత్తులో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు భైంసా దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..

దస్తురాబాద్(కడెం),అక్టోబర్17 : జీవితంపై విరక్తి చెంది బోలిశెట్టి శ్రీనివాస్(34) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతి చెందిన ఘటన మండలంలోని అంబారిపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంబారిపేట గ్రామానికి చెందిన బోలిశెట్టి శ్రీనివాస్(34) మద్యానికి బానిసై జీవితం పై విరక్తి చెంది బుధవారం రాత్రి 7 గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు నిర్మల్ దవాఖానకు తరలించారు.చికిత్స పొందుతూ గురువారం ఉదయం 10.36 గంటలకు మృతి చెందాడు. మృతుని భార్య శిరీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసం

ఖానాపూర్, అక్టోబర్ 17 : ఖానాపూర్-తర్లపాడు శివారులో అడవి పందులు వరి పంటను ధ్వంసం చేశాయి. అటవీ శాఖ అధికారులు వన్యప్రాణులు పంట పోలాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన పంటలను సర్వే చేసి ఆదుకోవాలని కోరారు.

బామ్ని నుంచి తురాటి రోడ్డుకు నిధులు మంజూరు

భైంసా, అక్టోబర్17 : నర్సాపూర్ (జీ) మండలం బామ్ని వయా తురాటి రోడ్డుకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ. 3 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. ఈ నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఘన సన్మానం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 17 : నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సోమ భీమిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఈటల శ్రీనివాస్‌ను గురువారం స్థానిక గండి రామన్న దత్తసాయి ఆలయంలో సాయి సేవా సంఘం సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బురాజ్, బిట్టింగ్ రజని కాంత్, లింగారెడ్డి పాల్గొన్నారు.

సోన్, అక్టోబర్ 17: నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సోమ భీంరెడ్డి బాధ్యతలు చేపట్టడంతో గురువారం సోన్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సరస్వతి డిస్టిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ మోహినొద్దీన్, అజహర్, నర్సయ్య పాల్గొన్నారు.

ప్రపంచంలోనే భారతీయ సంస్కృతి గొప్పది

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 17: ప్రపంచంలోనే భారతీయ సంస్కృతి గొప్పదని దీనిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించి హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని తెలంగాణ ప్రాంత కార్యవాహ్ కాచం రమేశ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పథసంచలన్ కార్యక్రమం నిర్వహించారు. కేదార్‌నాథ్ జిన్నింగ్ మిల్లు డైరెక్టర్ కృష్ణసంతోష్, స్వయం సేవకులు పాల్గొన్నారు.

హరితవనం సందర్శన

శిక్షణ బీట్ ఆఫీసర్లకు అవగాహన కల్పిస్తున్న ఆదిలాబాద్ ఎఫ్ఆర్వో గులాబ్‌సింగ్

ఎదులాపురం, అక్టోబర్ 17 : దూలపల్లి ఫారెస్ట్ ఆకాడమీకి చెందిన 54 మంది శిక్షణ బీట్ ఆఫీసర్లు గురువారం మావల మండలంలోని హరితవనం పార్కును సందర్శించారు. శిక్షణ బీట్ ఆఫీసర్లకు అటవీ రక్షణ, సంరక్షణ అన్ని విషయాలపై ఆదిలాబాద్ ఎఫ్ఆర్వో గులాబ్‌సింగ్ అవగాహన కల్పించారు. పార్కులోని వివిధ రకాల మొక్కలు, రాణివనం, కార్తికవనం, వివ్‌పాయింట్, గడ్డిప్లాంట్ తోటలు, అటవీ జంతువుల పరిరక్షణ, రక్షణ, అటవీ పెంపకంపై శిక్షణ ఇచ్చారు. దూలపల్లి రేంజ్ ఆఫీసర్ స్వరూప, బీట్ ఆఫీసర్ జ్యోత్స్న, శిక్షణ బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

నీటి ఒర్రెలో నవజాత శిశువు మృతదేహం

సారంగాపూర్, అక్టోబర్ 17 : బోరింగా గ్రామ శివారులోని నీటి ఒర్రెలో గురువారం నవజాత శిశువు మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఒర్రె వైపు వెళ్తుండగా నీటి ఒర్రెలో నవజాత శిశువు మృతదేహం కనబడడంతో వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. దాంతో గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎవరో కనికరం లేని తల్లి ఆడ శిశువు జన్మించడంతో వదిలేశారని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఆదివాసీ వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

ఎదులాపురం, అక్టోబర్ 17 : నార్నూర్ మండలం మరపగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ వైద్య విద్యార్థి పూసం అశోక్‌కు అభిమాన్య గ్రూపు ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. మానవత్వంతో ఆర్థిక సహాయం అందజేసిన అభిమాన్య గ్రూపు సభ్యులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో మెప్రం శేఖర్ బాబు, గ్రూప్ అడ్మిన్ పెందూర్ దీపక్, మడావి రూప్‌దేవ్, తొడసం నాగోరావ్, కృష్ణకుమార్, పీఈ ర్టీయూ జిల్లా అధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

వ్యక్తిని ఢీ కొన్న ఈవో కారు

బాసర, అక్టోబర్ 17 : బాసర మండల ఈవో గోవింద రాజు వాహనం గురువారం ఉదయం రోడ్డుపై వాకింగ్ చేస్తున్న ఒక వ్యక్తిని ఢీ కొట్టింది. వివరాల ప్రకారం.. బాసర మండలంలో ఈవోగా పని చేస్తున్న గోవింద రాజు మద్యం తాగి వాహనం నడుపుతూ ఉదయం రోడ్డుపై వాకింగ్ చేస్తున్న బాసరకు చెందిన విజయరామారావును ఢీ కొట్టడంతో అతడికి గాయాలయ్యాయి. పట్టింపు లేకుండా ఈవో అక్కడి నుంచి గ్రామ పంచాయతీకి వెళ్లి పోయి తన టేబుల్‌పై పడుకున్నాడు. దీంతో బాధితులు, గ్రామస్తులు వెళ్లి ప్రశ్నించగా ఎలాంటి సమాధానం ఇవ్వక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు వచ్చి పరిశీలించారు. బాధితుడికి గాయాలతో పాటు కారు అద్దం పగిలి పోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హవర్గలో భారీ చోరీ

లోకేశ్వరం, అక్టోబర్ 17 : హవర్గ గ్రామంలో దొంగలు రెచ్చి పోయారు. తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేసి బంగారంతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాల ప్రకారం.. హవర్గ గ్రామానికి చెందిన తుంగినోల గంగాధర్ ఈ నెల 15వ తేదీన ఇంటికి తాళం వేసి దసరా పండుగకు వెళ్లిన భార్య, పిల్లలను తీసుకురావడానికి జగిత్యాల జిల్లా మల్లాపూర్ గ్రామానికి వెళ్లాడు. గురువారం ఇంటికి తిరిగి రాగా ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించారు. దొంగలు బీరువాను పగలగొట్టి అందులోని లక్షా 30 వేల నగదుతో పాటు 12 గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ దిగంబర్ తెలిపారు.

తాగునీటి సహాయకుల శిక్షణ తరగతులు

బోథ్, అక్టోబర్ 17 : మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సహాయకులకు రెండో రోజులుగా శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్, మండల ప్రత్యేకాధికారి వాజిద్ అలీ, ఏఈ కల్యాణ్, ఎంపీడీవో జీవన్ రెడ్డి, ఏఈ పాల్గొన్నారు.

భీంపూర్, అక్టోబర్ 17 : భీంపూర్‌లో రక్షిత మంచి నీటి పథకాల ఎంపీడబ్ల్యూ (సహాయకుల) శిక్షణ కొనసాగుతున్నది. బోరు బావులు, నీటి ట్యాంకుల మోటర్లు చెడిపోయినప్పుడు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీవో గోపాల కృష్ణా రెడ్డి గుర్తుచేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, శిక్షకులు పాల్గొన్నారు.

క్షయ కట్టడిపై కోర్ కమిటీ సమావేశం

ఎదులాపురం, అక్టోబర్ 17 : క్షయ కట్టడిపై ఆదిలాబాద్ రిమ్స్‌లో కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ నివారణ అధికారి సుమలత మాట్లాడుతూ ఆసక్తి ఉన్న వైద్య విద్యార్థులు క్షయ వ్యాధిపై పరిశోధనలు, అధ్యయనాలు చేస్తే తమ శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. వ్యాధి గుర్తింపు, నియంత్రణ కోసం రిమ్స్‌లోని సీబీ నాట్ సేవలను వినియోగించుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

ఎదులాపురం, అక్టోబర్ 17: వైద్య విద్యార్థులు ర్యాగింగ్ నుంచి దూరంగా ఉండాలని ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్ సూచించారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థులకు ఆడిటోరియంలో ఓరియంటేషన్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు తమని తాము పరిచయం చేసుకున్నారు. వైద్య కళాశాలలో క్రమశిక్షణతో చదువుకొని మంచి వైద్యులుగా ఎదగాలని డైరెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వంజరి పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

బేల, అక్టోబర్ 17: వర్షాల కారణంగా నది పరివాహక ప్రాంతాల్లో నష్టపోయిన రైతుల ఖాతాల్లో డబ్బులు విడుదల చేయడంపై సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి గురువారం రైతులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని గూడ, బేదోడ, మణియార్‌పూర్, సింగిడి గ్రామాల 490 మంది రైతులకు నేరుగా రూ.86 లక్షల విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ రూపేశ్ రెడ్డి, ఫైజుల్లా ఖాన్, రాందాస్ నాక్లే, వమాన్ వంకాడే, రైతులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ శాఖాధికారి బాధ్యతలు స్వీకరణ

బేల, అక్టోబర్ 17 : మండల వ్యవసాయ శాఖాధికారిగా గోపిడి సాయితేజరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను సిబ్బంది శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఈవోలు రమణ, ఉమర్, రాజు, సాయి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

కుంటాల, అక్టోబర్ 17 : మండలాల్లోని అన్ని గ్రామాలు, తండాల్లో సామాన్య ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని డీపీవో శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. గురువారం కల్లూరులో లోకేశ్వరం, కుభీర్, కుంటాల, భైంసా మండలాలకు చెందిన కార్యదర్శులు, కారోబార్‌లతో సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లు వేగవంతం చేయడం, ఇతర సంపదని సృష్టిస్తూ గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భైంసా డీఎల్‌పీవో సుదర్శన్, లీడ్ బ్యాంకు మేనేజర్, ఆయా మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

దస్తురాబాద్(కడెం),అక్టోబర్ 17 : మంచిర్యాల డిపోకు చెందిన బస్సు మంచిర్యాల నుంచి నిర్మల్ వైపు అధిక ప్రయాణికులతో వెళ్తుండగా గురువారం పెద్దూర్ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై బస్సు వెనుక టైరు పేలడంతో అందులో ఉన్న ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తతో తృటిలో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులో 65 సీట్లు ఉంటే పరిమితికి మించి దాదాపు 90 మందికి పైగా ప్రయాణికులతో వెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్నారం నుంచి నిర్మల్ వైపు తక్కువ బస్సులు ఉండడంతోనే ఒక్క బస్సులోనే దాదాపు 100 మందితో ప్రయాణం చేయాల్సిన పరిస్థిత